'ఆడుదాం ఆంధ్ర'తో క్రీడా స్ఫూర్తి పెంపు


పెనుగొండ: ఆచంటలో వాలీబాల్ టీంల మధ్య టాస్ వేస్తున్న సర్పంచ్ కోట సరోజని

పెనుమంట్ర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల ద్వారా క్రీడా స్ఫూర్తి పెరుగుతుందని అంతర్జాతీయ క్రీడాకారిణి, డబుల్ ఒలింపియన్ సత్తి గీతారెడ్డి అన్నారు. స్థానిక నాయకులు, అధికారుల ఆహ్వానం మేరకు తన స్వగ్రామమైన మార్టేరు గ్రామంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి హాజరైన ఆమె పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణితో కలిసి విలేకరులతో మాట్లాడారు. జగనన్న ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

వివిధ గ్రామాల్లో ఉత్సాహంగా పోటీలు

పోడూరు/పెనుగొండ/మొగల్తూరు/నరసాపురం రూరల్: మండలంలోని పోడూరు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం పోడూరు, జగన్నాథపురం గ్రామాలకు చెందిన క్రీడాకారులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌లు శెట్టిబత్తుల సువర్ణరాజు, గుడాల శిరీష చంటి, ఎంపీడీఓ డి.సుహాసిని, ఈఓపీఆర్‌డీ ఎం.బలరామరాజు పోటీలను పర్యవేక్షించారు. ఆచంట మండలంలో ఆచంట గ్రామంలో సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు శుక్రవారం ఆటలను ప్రారంభించారు. కొడమంచిలిలో సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, వల్లూరులో ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, ఆచంట వేమవరంలో సర్పంచ్ జక్కంశెట్టి చంటి, పెనుగొండ మండలంలో వడలిలో సర్పంచ్‌కాసాని విజయలక్ష్మి, సిద్ధాంతంలో ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, దేవలో సర్పంచ్ నల్లూరి సత్యనారాయణలు ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రారంభించారు. మొగల్తూరు మండలంలో శుక్రవారం మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆవరణలో షటిల్, కబడ్డీ పోటీలలో మొగల్తూరు-1, మొగల్తూరు2కు సంబంధించిన క్రీడాకారులు పోటీపడగా, కెపిపాలెం పాఠశాల ఆవరణలో పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్ గ్రామాలకు చెందిన క్రీడాకారులు వాలీబాల్ పోటీల్లో తలపడినట్టు పీడీ సుజాత తెలిపారు. నరసాపురం మండలంలో శుక్రవారం సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఎంతఊ పుష్పరాజ్యం పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఎల్బీచర్ల-1,ఎల్బీచర్ల-2 టీంల మధ్య జరిగిన పోటీల్లో ఎల్బీచర్ల-1 టీం గెలుపొందింది. కొప్పర్రు-1, కొప్పర్రు-2 టీంల మధ్య జరిగిన పోటీల్లో కొప్పర్రు-2 టీం గెలుపొందింది.

సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం


చించినాడలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో చించినాడలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలకొల్లు నియోజకవర్గానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ, సర్పంచ్ దంగేటి రాజమణి, ఎంపీటీసీ సభ్యురాలు నల్లి సంధ్యారాణి, ఉప సర్పంచ్ రుద్రరాజు చిన్న, రావూరి వెంకట కోటి మురళీకృష్ణ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉన్నత భవిష్యత్

యలమంచిలి: పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించడం ద్వారా వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. కనకాయలంక గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ నిమ్మల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పేదలకు ఉన్నత, సాంకేతిక విద్య నందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని పెనుగొండ ఎంపీటీసీ సభ్యుడు తాడి సుబ్బిరెడ్డి అన్నారు. శుక్రవారం పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనరు పలివెల శ్రీను, పంచాయతీ సభ్యులు పూతినీడు శ్రీను, వెలగల శ్రీనివాసరెడ్డి, వేండ్ర లీలా వెంకట రమణ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' వివరాలు అప్‌లోడ్ చేయాలి

పాలకొల్లు సెంట్రల్: ఆడుదాం ఆంధ్రలో ఆటల వివరాలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని మునిసిపల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి అన్నారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో తన ఛాంబర్‌లో సచివాలయ అడ్మిన్‌లకు అవగాహన కల్పించారు. అలాగే వచ్చే నెలలో పింఛన్ పెంపుతో పాటు ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకే అందించే క్రమంలో వాటి వల్ల ఉపయోగాన్ని వివరించాలని కోరారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

పోడూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ డి.సుహాసిని మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు. గుమ్మలూరు గ్రామ సచివాలయం-1లో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ గొట్టుముక్కల సోనియారమేష్, ఎంపీటీసీ సభ్యులు పోతాబత్తుల శ్రీలక్ష్మీదుర్గ, అంబటి సుధాకర్, ఉప సర్పంచ్ అల్లూరి గీతావాణి పాల్గొన్నారు.

వైభవంగా కలశ పూజలు

పెనుగొండ: సిద్ధాంతం బస్టాండ్ సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారికి 150 కలశాలతో సామూహిక పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారు జామునే వశిష్ట గోదావరి నుంచి 150 కలశాలతో గోదావరి జలాలను తీసుకు వచ్చి సువర్ణ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. గురుభవానీ మూడేళ్ల శ్రీను భవానీ ఆధ్వర్యంలో అర్చకులు పూజ్యం వెంకట రమణ బ్రహ్మత్వంలో పూజలు చేశారు. సాయంత్రం 200 మంది భవానీ మాలధారులు జ్యోతి ప్రదర్శన నిర్వహించి, నిప్పుల గుండం తొక్కారు. కసుగుర్తి వెంకటరామన్న, బోళ్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.





































